News Daily
ఎడిటర్ :
B. ఉపేందర్
cknews7484@gmail.com
Visit in : www.cknewstv.in

# CK NEWS
చంద్రకాంత్
తెలుగు దినపత్రిక

Website
cknewstv.in

సంపుటి : 05 | సంచిక :3 | ఖమ్మం | మంగళవారం ఫిబ్రవరి 17, 2026 | CK NEWS | పేజీలు : 08

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar. Rangareddy, Medak, Adilabad



## కిమ్ రాజ్యంలో 'అత్తాకోడళ్ల' పోరు తప్పదా..?

నిరంకుశ పాలనకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచే కిమ్ రాజ్యంలో కుటుంబ పోరుకు తెర లేచిందా? అధికార పగ్గాల కోసం అత్తా కోడళ్లు పోటీ పడనున్నారా? ప్రస్తుత పరిణామాలు చూస్తుంటే ఇలాంటి ప్రశ్నలే ఎదురవుతున్నాయి. ఉత్తరకొరియా అధినేత కిమ్ జోంగ్ ఉన్ తన వారసత్వ పగ్గాలను 13 ఏళ్ల తన కుమార్తె కిమ్ జు యేకు అప్పగించే అవకాశం ఉన్నట్లు ఇటీవల దక్షిణ కొరియా స్పై ఏజెన్సీ వెల్లడించింది. అదే జరిగితే కిమ్ కు తన సోదరి నుంచి సవాలు ఎదురయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

**కుమార్తెకు పట్టం..**

కిమ్ జోంగ్ ఉన్ తన రాజకీయ వారసురాలిగా కుమార్తె కిమ్ జు యేను ప్రకటించే అవకాశాలున్నట్లు దక్షిణ కొరియా నిఘా సంస్థ నేషనల్ ఇంటెలిజెన్స్ సర్వీస్(ఎన్ఐఎస్) అంచనా వేసింది.

2

# భారత్ శక్తివంతమైన దేశం..

## మోదీ ఇజ్రాయెల్ పర్యటనపై నెతన్యాహు ప్రశంసలు.. ప్రపంచవ్యాప్తంగా ఆసక్తి!

**భారత ప్రధాని నరేంద్ర మోదీ ఈ నెల ఫిబ్రవరి 25, 26 తేదీల్లో రెండు రోజుల పాటు ఇజ్రాయెల్‌లో పర్యటించనున్నారు. ఈ విషయాన్ని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు స్వయంగా ప్రకటించారు. అమెరికన్ యూదు సంస్థల ప్రతినిధులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, వచ్చే వారం మన దేశానికి ఎవరు వస్తున్నారో తెలుసా ? నరేంద్ర మోదీ వస్తున్నారు" అని ఉత్సాహంగా చెప్పారు.**



**భారత్ పై ప్రశంసలు:**

భారత్, ఇజ్రాయెల్ మధ్య అద్భుతమైన స్నేహం ఉంది. మేము అన్ని రంగాల్లో సహకారం గురించి చర్చించబోతున్నాం. భారతదేశం చిన్న దేశం కాదు, 140 కోట్ల జనాభా ఉన్న దేశం. భారతదేశం ఎంతో శక్తివంతమైనది, ప్రపంచవ్యాప్తంగా మంచి గుర్తింపు ఉన్న దేశం అని నెతన్యాహు అన్నారు.


**ఈ పర్యటన ఎందుకు ప్రత్యేకం:**

ప్రధాని నరేంద్ర మోదీ చివరిసారిగా 2017లో ఇజ్రాయెల్ సందర్శించారు. మళ్లీ తొమ్మిదేళ్ల తర్వాత ఇప్పుడు పర్యటిస్తున్నారు. మోదీ మూడోసారి ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఇజ్రాయెల్‌కు వెళ్లడం ఇదే తొలిసారి.

**ఇజ్రాయెల్ టూర్ ఎందుకు:**

రక్షణ రంగం, సైబర్ భద్రత, వ్యవసాయం, ఉగ్రవాద నిర్మూలనపై ఇరు దేశాల మధ్య కీలక చర్చలు జరగనున్నాయి.

2



2

## ఇక ఈ అవమానాన్ని భరించలేను

- పార్టీలో కొనసాగడం కష్టంగానే ఉంది
- జగిత్యాలను బీఆర్ఎస్ ఎమ్మెల్యేకు రాసిచ్చారు
- మాజీ ఎమ్మెల్సీ కాంగ్రెస్ నేత జీవన్ రెడ్డి ఆవేదన



### 5 ఏళ్లలో ఐటీ, బీపీఓ జాబ్స్ మాయం..!

**బాంబు పేల్చిన వినోద్ ఖోస్లా**

ప్రముఖ టెక్ బిలియనీర్, వెంచర్ క్యాపిటలిస్ట్ సన్ మైక్రోసిస్టమ్స్ సహ వ్యవస్థాపకుడు వినోద్ ఖోస్లా భారతీయ ఐటీ రంగంపై బాంబు పేల్చారు. ఢిల్లీలో జరుగుతున్న ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026 సందర్భంగా

2



### సీఎం, మంత్రులు కుట్రలు చేశారు

**కరీంనగర్‌లో ధర్మం గెలిచింది**
**కేంద్ర మంత్రి బండి సంజయ్**

ప్రజలు కోరుకున్న విధంగా కరీంనగర్‌లో ధర్మం గెలిచిందని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ అన్నారు. సోమవారం కరీంనగర్ కార్పొరేషన్ మేయర్, డిప్యూటీ మేయర్‌ల ఎన్నిక తర్వాత ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్, భారత రాష్ట్ర సమితి , ఎంఐఎం, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్, స్వతంత్ర అభ్యర్థులు కలిసి కరీంనగర్‌లో భాజపా మేయర్

2



# ఉత్కంఠ.. ఉద్రిక్తం.. ఉత్సాహం

## మేయర్లు, చైర్మన్‌ఎన్నికల్లో గందరగోళం

- నిజామాబాద్లో కాంగ్రెస్.. కొత్తగూడెంలో సీపీఐకి పట్టం
- కామారెడ్డి, ఆదిలాబాద్లో స్వతంత్రులకు అవకాశం
- ఇబ్రహీంపట్నంలో ఉద్రిక్తత.. బల్దియా ఆఫీసుపై రాళ్లదాడి
- తొర్రూర్లో ఉద్రిక్తం.. ఎక్స్‌అఫిషియోగా ఓటేసిన ఎంపీ కావ్య
- మున్సిపల్ ఆఫీసు వద్ద బీఆర్ఎస్ వర్సెస్ కాంగ్రెస్

2



**తె**లంగాణలో మున్సిపల్ కార్పొరేషన్‌లో కొత్త పాలకవర్గాలు కొలువు తీరాయి. మున్సిపాలిటీలు, కార్పొరేషన్లపై ఎస్ఈసీ అధికారిక వివరాలు వెల్లడించింది. ఈ వివరాల ప్రకారం కాంగ్రెస్ ఖాతాలో 82 మున్సిపాలిటీలు, 5 కార్పొరేషన్లు చేరాయి. బీఆర్ఎస్ ఖాతాలో 17 మున్సిపాలిటీలు చేరగా, బీజేపీ ఖాతాలో ఒక మున్సిపాలిటీ, ఒక కార్పొరేషన్ చేరింది. ఇక సీపీఐ ఖాతాలో కొత్తగూడెం కార్పొరేషన్ చేరగా, ఇండిట్లు నాలుగు మున్సిపాలిటీలను దక్కించుకున్నారు.

### 10 బల్దియాల్లో వాయిదా

ఖానాపూర్ లో బీజేపీ, బీఆర్ఎస్ కౌన్సిలర్ల గైర్హాజరు

సుల్తానాబాద్లో ఖరారు కాని చైర్మన్, వైస్ చైర్మన్ పేర్లు

కోరం లేక వాయిదా వేసిన అధికారులు



హైదరాబాద్, ఫిబ్రవరి 16: రాష్ట్రంలోని 116 మున్సిపాలిటీలు, ఏడు కార్పొరేషన్లలో చైర్మన్లు, వైస్ చైర్మన్లు, మేయర్లు, డిప్యూటీ మేయర్ల ఎన్నిక తీవ్ర ఉద్రిక్తతల మధ్య జరిగింది. కొన్ని పట్టణాలు, నగరాల్లో అంచనాలు తారు మరయ్యాయి, ఇబ్రహీంపట్నం, తొర్రూరు, క్యాతనపల్లి, జనగామ, జమ్మికుం టలో ఉద్రిక్త పరిస్థితులు చోటు చేసుకున్నాయి. ఏడు కార్పొరేషన్లలో ఐదింటిని కాంగ్రెస్ కైవసం చేసుకుంది. కొత్తగూడెంలో సీపీఐ జెండా ఎగిరింది. కరీం నగర్ కార్పొరేషన్ మేయర్ పదవి ఎట్టకేలకు బీజేపీకే దక్కింది. ఇక్కడ ఎక్స్ అఫిషియో సభ్యుడిగా కేంద్ర మంత్రి బండి సంజయ్ ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఇక్కడి నుంచి కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ మాజీ మేయర్ సునీల్ రావుగా ఎన్నికయ్యారు. నిజామాబాద్ మేయర్గా కూరగాయల ఉమారాణిని ఎన్నుకున్నారు.



# నేటి నుంచి బయో ఏషియా సదస్సు

**రెండ్రోజుల పాటు జరుగనున్న అంతర్జాతీయ సదస్సు**

**సదస్సును ప్రారంభించనున్న సీఎం రేవంత్ రెడ్డి**

బయో ఏషియాఉ2026 సదస్సుకు రాజధాని ముస్తాబైంది. నేడు, రేపు (ఈ నెల 17, 18 తేదీల్లో) హైదరాబాద్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్(హెచ్ఐసీసీ) హాల్ - 4లో రెండ్రోజులపాటు సదస్సు నిర్వహించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. 17న సీఎం రేవంత్రెడ్డి, ఐటీ, మంత్రి శ్రీధర్ బాబు బయో ఏషియా సదస్సు 23వ ఎడిషన్ ను ప్రారంభిస్తారు. 'టెక్బయో అన్లిష్డ్ ఏఐ, ఆటోమేషన్-బయాలజీ రివల్యూషన్"అనే థీమ్ తో ఈ సదస్సు నిర్వహిస్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా బయో టెక్నాలజీ, ఔషధాలు, హెల్త్ రంగాలకు చెందిన నిపుణులు, 50 దేశాలకు చెందిన 3 వేల మంది ప్రతినిధులు ఈ సదస్సులో పాల్గొంటారు. గ్లోబల్ లైఫ్ సైన్సెస్, హెల్త్ కేర్ రంగాల్లో నూతన ఆవిష్కరణలు, సరికొత్త ఆలోచనలను ఈ సదస్సు వేదికగా పంచుకోనున్నారు.

హైదరాబాద్, ఫిబ్రవరి 16: తెలంగాణ ప్రభుత్వం ప్రపంచ స్థాయిలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 23వ బయో ఏషియా 2026 అంతర్జాతీయ సదస్సు ఫిబ్రవరి 17 మంగళవారం నుండి భాగ్యనగరంలో అట్టహాసంగా ప్రారంభం కానుంది. హైదరాబాద్లోని హైటెక్స్ వేదికగా రెండు రోజుల పాటు జరగనున్న ఈ సదస్సును రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారు. ఈ ఏడాది సదస్సును 'టెక్బయో అన్లిష్డ్ ఏఐ, ఆటోమేషన్, జీవశాస్త్ర రంగంలో వస్తున్న విప్లవాత్మక పరిణామాలు' అనే ప్రధాన ఇతివృత్తంతో నిర్వహిస్తున్నారు.

2



## రాజస్థాన్ ఫ్యాక్టరీలో అగ్నిప్రమాదం

ఏడుగురు వ్యక్తుల సజీవ దహనం

2

## ఏఐ సమ్మిట్‌కు భారత్ వేదిక కావడం గర్వకారణం

ప్రపంచ దేశాలకు ప్రధాని మోదీ ఆహ్వానం

2



# ఉత్కంఠ.. ఉద్రిక్తం.. ఉత్సాహం

- మొదటి పేజి తరువాయి
తొలిసారిగా కార్పొరేషన్లుగా అప్గ్రేడ్ అయిన మంచిర్యాల, మహబూబ్ నగర్, నల్లగొండలలో కాంగ్రెస్ జెండా ఎగిరింది. రామగుండం మేయర్గా మహంకాళి స్వామి, డిప్యూటీ మేయర్ 57వ డివిజన్ కార్పొరేటర్ పాతిపెల్లి ఎల్లయ్య ఎన్నికయ్యారు. అనూహ్య పరిణామాల మధ్య కామారెడ్డి, ఆదిలాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ స్థానాలు ఇండిపెండెంట్లకు దక్కాయి. కామారెడ్డి నుంచి ఇండిపెండెంట్ గా పోటీ చేసి గెలుపొందిన ఇప్పు ఉమారాణి మున్సిపల్ చైర్ పర్సన్ అయ్యారు. ఆమె కౌన్సిలర్గా గెలిచిన తర్వాత కాంగ్రెస్లో చేరారు. ఇక్కడ మ్యాజిక్ ఫిగర్ దక్కక పోవ డంతో ఉమారాణికి కాంగ్రెస్, బీఆర్ఎస్ మద్దతు ఇచ్చాయి. వైస్ చైర్ పర్సన్ బీఆర్ఎస్ కు దక్కింది. ఆదిలాబాద్ లో కాంగ్రెస్ బలపర్చిన స్వతంత్ర అభ్యర్థి బండారి అనూష చైర్ పర్సన్ గా ఎన్నికయ్యారు. తొర్రూరులో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య చోటు చేసుకున్న గొడవలో మాజీ మంత్రి ఎర్రబెల్లి పీఏకు స్వల్పంగా గాయాలయ్యాయి. ఇక్కడి నుంచి వరంగల్ ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే యశస్వినీ రెడ్డి ఎక్స్ అఫీషియో ఓటునువినియోగించుకునేందుకు రావడంతో ఉద్రిక్తత నెలకొంది. ఇబ్రహీంపట్నం లో కౌన్సిలర్ల కిడ్నాప్ వార్త కలకలంపరపాలక సంఘ కార్యాలయంరేపింది. దీంతో ఆందోళన కారులు బల్దియా ఆఫీసుపై రాళ్లు రువ్వడంతో గందరగోళం నెలకొంది

# 10 బల్దియాల్లో వాయిదా

హైదరాబాద్, ఫిబ్రవరి 16: రాష్ట్రవ్యాప్తంగా 9 మున్సిపాలిటీల్లో చైర్మన్, వైస్ చైర్మన్ఎన్నికలు వాయిదా పడ్డాయి. పలుచోట్ల బీఆర్ఎస్, బీజేపీ సభ్యులు ప్రమాణ స్వీకారోత్సవానికి గైర్హాజరయ్యారు. దీంతో కోరం లేక పాలకమండలి ఎన్నికను వాయిదా వేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్, ఇంద్రేశం, భద్రాద్రి కొత్త గూడెం జిల్లా ఇల్లందు, జనగామ, పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్, నిర్మల్ జిల్లా ఖానాపూర్, మంచిర్యాల జిల్లా క్యాతన పల్లి, ఇబ్రహీంపట్నం, ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్, మహబూబాబాద్ జిల్లా తొర్రూర్, డోర్నకల్ బల్దియాలో చైర్మన్, వైస్ చైర్మనే పేర్లు ఇంకా ఫిక్స్ కాలేదు.

**కుదరని ఏకాభిప్రాయం**

**నిర్మల్:** ఖానాపూర్ మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక కోరం లేకపోవడంతో వాయిదా పడింది, 12 మంది కౌన్సిలర్లకు గాను కాంగ్రెస్ పార్టీకి చెందిన ముగ్గురు, ఒక్క ఇండి పెండెంట్ కౌన్సిలర్ మాత్రమే సమావేశానికి హాజరై ప్రమాణ స్వీకారం చేశారు. మిగతా నలుగురు బీజేపీ సభ్యులు, నలుగురు బీఆర్ఎస్ కౌన్సిలర్లు గైరాజరయ్యారు. దీంతో కోరం లేక ఎన్నికలు వాయిదా వేశారు. బీజేపీ, బీఆర్ఎస్ మధ్య జరిగిన మంతనాలు సయోధ్య కుదరలేదని తెలుస్తోంది.

**కోల్ బెల్ట్: మంచిర్యాల జిల్లా క్యాతనపల్లి మున్సిపల్**

**క్యాతనపల్లిలో తీవ్ర ఉద్రిక్తత**

ఆఫీస్ వద్ద తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. కార్యాలయంలోకి దూసుకెళ్లేందుకు కాంగ్రెస్, బీఆర్ఎస్, సీపీఐ శ్రేణులు ప్రయత్నించగా.. పోలీసులు అడ్డుకున్నారు. దీంతో సుమారు రెండు గంటలు సేపు అక్కడ గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. మరోవైపు ప్రమాణ స్వీకారం కార్యక్రమానికి ఉదయం 10.30 గంటల కు మున్సిపల్ కార్యాలయానికి చేరుకోవాల్సిన కౌన్సిలర్లు.12 గంటల వరకు కూడా ఎవరు రాలేదు. దీంతో కోరం లేకపోవడంతో చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికను రేపటికి వాయిదా వేస్తున్నట్లు మందమర్రి తహసీల్దార్, ప్రత్యేక అధికారి సతీష్ కుమార్ ప్రకటనలో పేర్కొన్నారు.

**తొర్రూరులో ఉద్రిక్తత**

**మున్సిపల్ వద్ద బీఆర్ఎస్, కాంగ్రెస్ ఘర్షణ**

**భారీగా మోహరించిన పోలీసులు**

మహబూబాబాద్, ఫిబ్రవరి 16: తొర్రూర్ మున్సిపల్ కార్యాలయం వద్ద ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. బీఆ ర్ఎస్, కాంగ్రెస్ శ్రేణులు ఘర్షణకు దిగాయి. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆధ్వర్యంలో బీఆర్ఎస్ కౌన్సిలర్లు బస్సులో మున్సిపల్ కార్యాల యానికి చేరుకున్నారు. ఈ క్రమంలో పోలీసులు వారిని అడ్డుకోవడంతో ఘర్షణ వాతావరణం నెల కొంది. చివరకు బస్సును ఆఫీస్ వరకు అనుమతిం చారు. అనంతరం ఎమ్మెల్యే యశస్విని రెడ్డితో కలిసి కాంగ్రెస్ కౌన్సిలర్లు వచ్చారు. వరంగల్ ఎంపీ కావ్యను ఎక్స్ అఫీషియో సభ్యులుగా నమోదు చేయడం పట్ల మాజీ మంత్రి ఎర్రబెల్లి అభ్యంరతం వ్యక్తం చేశారు. మాజీ మంత్రిని అధికారులు అక్కడి నుంచి పంపించి వేశారు. ఈ క్రమంలో అక్కడికి భారీ సంఖ్యలో చేరుకున్న ఇరు పార్టీల నాయకులు, కార్యకర్తలు పరస్పరం వ్యతిరేకంగా నినాదాలు చేసుకున్నారు. ఎర్రబెల్లి పీఏపై కాంగ్రెస్ శ్రేణులు దాడికి పాల్పడ్డారు. పరిస్థి తి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు భారీ సంఖ్యలో మోహరించారు.

# పార్టీలో అవమానం ఇంకెంతకాలం

జగిత్యాల, న్యూస్‌టుడే: వలసవాదికి జగిత్యాల పురపాలక ఛైర్‌పర్సన్ పదవి ఇచ్చారని మాజీ మంత్రి జీవన్‌రెడ్డి అన్నారు. సోమవారం జగిత్యాలలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తాను మొదటి నుంచీ కాంగ్రెస్‌కు కట్టుబడి ఉన్నానని.. కాంగ్రెస్ అభ్యర్థులుగా, స్వతంత్రులుగా ఎన్నికైన తన అనుచరులను ప్రజాభవన్‌కు తీసుకెళ్లి చూపించానని పేర్కొన్నారు. మొదటి నుంచి పనిచేసిన వారికి ఛైర్మన్ పదవి ఇవ్వాలని సూచించానని.. అలా కాకుండా ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ మనుషులకు.. పుర ఎన్నికలో కాంగ్రెస్ టికెట్ ఇవ్వడమే కాకుండా మున్సిపల్ ఛైర్మన్ పదవి ఇచ్చారని మండిపడ్డారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక కార్యకర్తలకు అన్యాయం జరగడం తనను బాధిస్తుందన్నారు. తనను మానసిక క్షోభకు గురి చేస్తున్నారని, అవమానాలు ఎంతకాలం భరించాలని ప్రశ్నించారు.

# సాగర తీరంలో నౌకాదళ విన్యాసాలు...

అంతర్జాతీయ ఫ్లీట్ రివ్యూ (ఐఎఫ్ఆర్)లో పాల్గొనేందుకు భారత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము మంగళవారం విశాఖపట్నం రానున్నారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా ఆమె ఈ కార్యక్రమంలో పాల్గొంటారు. సాయుధ దళాల సర్వ సైన్యాధ్యక్షురాలి హోదాలో రాష్ట్రపతి ఈ విన్యాసాలను సమీక్షిస్తారు. అంతర్జాతీయ నౌకాదళ ప్రతినిధులు, యుద్ధనౌకలు, జలాంతర్గాములు, విమానాలు ఒకచోటకి చేరి తమ శక్తిసామర్థ్యాలను ప్రదర్శించడమే ఐఎఫ్ఆర్ ముఖ్య ఉద్దేశం.

మంగళవారం రాష్ట్రపతి గౌరవార్థం ఇచ్చే విందుతో ఐఎఫ్ఆర్–2026 కార్యక్రమాలు ప్రారంభమవుతాయి. మరుసటి రోజు విశాఖ తీరంలో ఏర్పాటు చేసిన యాంకరేజ్ ప్రాంతంలో భారత్‌తో పాటు స్నేహపూర్వక దేశాలకు చెందిన సుమారు 70 యుద్ధనౌకల ఫ్లీట్‌ను రాష్ట్రపతి సమీక్షిస్తారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ గవర్నర్ జస్టిస్ ఎస్. అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా పాల్గొంటారు. దేశాల మధ్య సముద్రయాన శక్తిని, సహకారాన్ని, స్నేహాన్ని ప్రదర్శించడమే ఈ కార్యక్రమ లక్ష్యమని భారత నౌకాదళం వివరించింది.

ఈసారి ఐఎఫ్ఆర్‌లో 'ఆపరేషన్ సిందూర్' హీరో, పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో నిర్మించిన విమాన వాహక నౌక ఐఎన్ఎస్ విక్రాంత్ ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. 'ఆపరేషన్ సిందూర్' సమయంలో పాకిస్థాన్ నౌకాదళాన్ని కట్టడి చేయడంలో ఈ యుద్ధనౌక వ్యూహాత్మకంగా కీలకపాత్ర పోషించింది. మిత్ర దేశాల నౌకాదళాలు ఈ విమాన వాహక నౌకను సమీపం నుంచి పరిశీలించనున్నాయి. ఈసారి విశాఖ కేవలం ఐఎఫ్ఆర్‌కే కాకుండా మరో రెండు కీలక కార్యక్రమాలకు కూడా వేదికైంది. భారత నౌకాదళం ఆధ్వర్యంలో 13వ ఎడిషన్ మిలాన్–2026, హిందూ మహాసముద్ర నౌకాదళ సింపోజియం సదస్సు కూడా ఇక్కడే జరుగుతున్నాయి. 135కి పైగా దేశాలను మిలాన్ విన్యాసాలకు ఆహ్వానించారు. భారత్ ఈ మూడు ప్రధాన సముద్రయాన కార్యక్రమాలను ఒకేసారి నిర్వహించడం ఇదే ప్రప్రథమం. భారత్‌లో తొలి ఐఎఫ్ఆర్‌ను 2001లో ముంబైలో నిర్వహించగా, అప్పటి రాష్ట్రపతి కేఆర్ నారాయణన్ సమీక్షించారు. రెండోసారి 2016లో విశాఖపట్నంలో నిర్వహించగా, అప్పటి రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ, ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొన్నారు. ఇప్పుడు మూడోసారి జరుగుతున్న ఈ కార్యక్రమం ద్వారా భారత నౌకాదళ శక్తి, అంతర్జాతీయ సంబంధాలు మరింత బలోపేతం కానున్నాయి.

# కిమ్ రాజ్యంలో 'అత్తాకోడళ్ల' పోరు తప్పదా..?

-మొదటిపేజీ తరువాయి
ఈ నెలాఖరులో కిమ్‌కు చెందిన వర్కర్స్ పార్టీ సదస్సు జరగనుంది. ఇదే వేదికగా ఆయన తన వారసత్వ ప్రణాళికలకు పార్టీ పరంగా ఆమోదముద్ర వేసుకునే అవకాశం ఉందని తెలిపింది. 13 ఏళ్ల కిమ్ జు యే 2022లో తొలిసారిగా ప్రపంచానికి కనిపించింది. ఆ తర్వాత ఆయుధ పరీక్షల నుంచి మిలిటరీ పరేడ్‌ల వరకు పలు అధికారిక, కీలక కార్యక్రమాల్లో తండ్రి వెంట హాజరైంది. వాస్తవానికి ఉత్తరకొరియా పురుషాధిక్య నాయకత్వ క్రమాన్ని పరిగణనలోకి తీసుకుంటే ఆమెకు వారసత్వ బాధ్యతలు అప్పగించే అవకాశాలు తక్కువనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. కానీ, గతేడాది సెప్టెంబరులో కిమ్ జోంగ్ ఉన్‌తో కలిసి బీజింగ్ పర్యటనకు వెళ్లడంతో ప్రపంచం దృష్టి ఆమెపై పడింది. కిమ్ రాజకీయ వారసురాలు ఆమెనే అనే అంచనాలు నాటినుంచే బలపడ్డాయి.

**సోదరీ.. శక్తిమంతమైన నాయకురాలే**

అయితే, వారసత్వ పగ్గాల బదిలీ విషయంలో కిమ్ జోంగ్ ఉన్‌కు తన సోదరి కిమ్ యో జోంగ్ నుంచి ప్రతిఘటన ఎదురయ్యే అవకాశాలు కన్పిస్తున్నాయి. 38 ఏళ్ల యో జోంగ్ ప్రస్తుతం దేశంలోనే రెండో అత్యంత శక్తిమంతమైన నాయకురాలిగా పేరొందారు. కొరియా వర్కర్స్ పార్టీ సెంట్రల్ కమిటీలో సీనియర్ హోదాలో ఆమె కొనసాగుతున్నారు. ఆమెకు దేశం లోపలా, వెలుపలా మంచి పాపులారిటీ ఉంది. సోదరుడి కిమ్ జోంగ్ ఉన్ పాలన పైనా ఆమె ప్రభావం చూపించగలరని చెబుతారు. 2022లో దక్షిణ కొరియా రక్షణమంత్రిని టార్గెట్ చేస్తూ కిమ్ యో జోంగ్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. దక్షిణ కొరియా వినాశనం తప్పదంటూ ఆమె నాడు తీవ్రంగా బెదిరించారు. ఆ తర్వాత కూడా పలుమార్లు అమెరికా, జపాన్ వంటి దేశాలను హెచ్చరిస్తూ వార్తల్లో నిలిచారు. కిమ్ జోంగ్ ఉన్‌కు హఠాత్తుగా ఏమైనా జరిగితే అధికార బాధ్యతలు అందుకునేది

అతని సోదరి అని గతంలో అంచనాలు వెలువడ్డాయి. రాజకీయంగానే గాక.. ఆమెకు మిలిటరీ మద్దతు కూడా ఉంది. అవకాశం వస్తే దేశ నాయకత్వ పగ్గాలను అందుకోవడానికి అన్నివిధాలా ఆమె సిద్ధంగా ఉన్నారంటూ దక్షిణ కొరియా ఇంటెలిజెన్స్ మాజీ అధికారి ఒకరు ఆ మధ్య అంచనా వేశారు.

**కిమ్ కుటుంబంలో 'రక్తచరిత్ర'..**

కిమ్ కుటుంబంలో ఇలాంటి తగాదాలు కొత్తేం కాదు. రాజకీయంగా తన ఎదుగుదలకు అడ్డు అని భావించిన వారిని కిమ్ చాకచక్యంగా తప్పిస్తారనే ప్రచారం ఉంది. అధికారంలోకి వచ్చిన కొన్నేళ్ల తర్వాత 2013లో తన బంధువు, మెంటార్ అయిన జాంగ్ సోంగ్ థేక్‌కు మరణశిక్ష

అమలు చేశారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారన్న ఆరోపణలపై కిమ్ ఈ చర్యలు తీసుకున్నట్లు నాడు వార్తలు వచ్చాయి. ఇక, కిమ్ సవతి సోదరుడు కిమ్ జోంగ్ నామ్ 2017లో మలేసియా ఎయిర్‌పోర్టులో హత్యకు గురయ్యారు. ఆ ఘటన వెనక కిమ్ హస్తం ఉందని ఆరోపణలు ఉన్నాయి.

# రాజస్థాన్ ఫ్యాక్టరీలో అగ్నిప్రమాదం

జయపుర, ఫిబ్రవరి 16: రాజస్థాన్లో భివాడీలోని ఓ రసాయన ఫ్యాక్టరీలో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఏడుగురు సజీవ దహనమయ్యారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం తెల్లవారుజామున భివాడీలోని ఓ రసాయన ఫ్యాక్టరీలో ఒక్కసారిగా మంటలు ఎగసిపడ్డాయి. అనంతరం భారీ పేలుళ్లు సంభవించడంతో స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు. ముందుజాగ్రత్త చర్యగా, సమీపంలోని కర్మాగారాల్లో పని చేస్తున్నవారిని ఖాళీ చేయించామన్నారు. ఈ ప్రమాదంలో సజీవదహనమైన ఏడుగురి మృతదేహాలను బయటకు తీసినట్లు అధికారులు పేర్కొన్నారు. మరికొందరు కార్మికులు మంటల్లో చిక్కుకున్నట్లు తెలుస్తోంది. అయితే ఎంతమంది ఉ న్నారనే విషయంపై స్పష్టత రావాల్సిఉంది. ప్రమాదంలో రూ. లక్షలు విలువ చేసే వస్తువులు, యంత్రాలు బూడిదయ్యాయన్నారు. ఫ్యాక్టరీలో నిల్వ చేసిన గ్యాస్ సిలిండర్లు పేలడంతో ఈ ప్రమాదం చోటుచేసుకున్నట్లు అనుమానం వ్యక్తంచేశారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. అగ్ని ప్రమాదంలో ఏడుగురు మృతి చెందడంపై ప్రధాని నరేంద్ర మోదీ విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు. ఈ ఘటనలో గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ ప్రమాదంపై ముఖ్యమంత్రి భజన్ లాల్ శర్మ దిగ్భ్రాం–రతి వ్యక్తంచేశారు. ఈ ఘటనలో గాయపడిన వారికి మెరుగైన వైద్య చికిత్స అందించాలని జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు.

# ఏఐ సమ్మిట్కు భారత్ వేదిక కావడం గర్వకారణం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16: దేశ రాజధాని ఢిల్లీలోని భారత్‌మండపంలో ఏఐ ఇంపాక్ట్ సమిట్ ను నిర్వహిస్తుండడంపై ప్రధాని నరేంద్ర మోదీ హర్షం వ్యక్తంచేశారు. ఏఐ ఇంపాక్ట్ సమిట్లో పాల్గొనాల్సిందిగా ప్రపంచ దేశాలకు ఆహ్వానం పలికారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రపంచ దేశాలకు భారత యువత ప్రతిభ, సామర్థ్యం తెలుస్తాయని.. ప్రపంచ అభివృద్ధిలో భారత్ తన సహకారాన్ని మరింత పెంచుకునేందుకు ముందడుగు వేస్తోందన్నారు. సైన్స్ అండ్ టెక్నాలజీలో భారత్ వేగంగా వృద్ధి చెందుతుందనడానికి ఈ కార్యక్రమం నిదర్శనమన్నారు. గ్లోబల్ సౌత్లో నిర్వహిస్తున్న ఈ మొదటి ప్రధాన అంతర్జాతీయ ఏఐ సమిట్ మన దేశంలో జరుగుతుండడం గర్వకారణమన్నారు. సర్వజన హితాయ, సర్వజన సుఖాయ' అనే ఈ సదస్సుథీమ్ పై మోదీ మాట్లాడుతూ.. ప్రపంచదేశాల పురోగతి కోసం కృత్రిమ మేధస్సును ఉపయోగించుకోవడంలో మన ఉమ్మడి నిబద్ధతను ఇది ప్రతిబింబిస్తుందన్నారు. ఈ సమిట్ వల్ల డిజిటల్ సదుపాయాల కల్పన, శక్తిమంతమైన స్టార్టప్ ఏర్పాటు, అత్యాధునిక పరిశోధనలు వంటి పలు అభివృద్ధి కార్యక్రమాల్లో భారత్ బాధ్యత మరింత పెరగనుందన్నారు. ఇప్పటికే ఆరోగ్య సంరక్షణ, విద్య, వ్యవసాయం, పాలన వంటి అనేక రంగాల్లో ఏఐ కీలక పాత్ర పోషిస్తుందన్నారు. నేటినుంచి 20వ తేదీ వరకు దిల్లీలో జరగనున్న ఈ సదస్సుకు 45కు పైగా దేశాల ప్రతినిధులు హాజరుకానున్నారు. ఆయా దేశాలు తమ ఏఐ అజెండాలను నిర్వచించుకోనున్నాయి. మన ప్రతిభను ప్రదర్శించడం, డిజిటల్ పబ్లిక్ మౌలిక సదుపాయాలను విస్తరించడం, విస్తృతం అవుతున్న అంకుర సంస్థల ఎకోసిస్టము ప్రపంచానికి పరిచయం చేయడం ఈ సదస్సు ఉద్దేశం.

## భారత్ శక్తివంతమైన దేశం..

-మొదటిపేజీ తరువాయి
ముఖ్యంగా పశ్చిమాసియాలో ప్రస్తుతం ఉన్న ఉద్రిక్త పరిస్థితులపై కూడా ఇద్దరు నేతలు చర్చించే అవకాశం ఉంది. ఇప్పటికే భారత్–ఇజ్రాయెల్ మధ్య ద్వైపాక్షిక పెట్టుబడి ఒప్పందం పై సంతకాలు జరిగాయి. రెండు దేశాలు కలిసి కొత్త రకమైన ఆయుధాలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని తయారు చేసుకునేలా గతంలోనే కీలక ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. ఈ పర్యటనతో ఆ బంధం మరింత బలపడనుంది.

## 5 ఏళ్లలో ఐటీ, బీపీఓ జాబ్స్ మాయం..!

-మొదటిపేజీ తరువాయి
తన అభిప్రాయాలను పంచుకుంటూ ఆసక్తికరమైన కామెంట్స్ చేశారు. ఏఐ దెబ్బకు రాబోయే 5 ఏళ్లలో భారతదేశపు ప్రధాన ఆదాయ వనరులైన ఐటీ సేవలు, బీపీఓ రంగాలు దాదాపుగా కనుమరుగవుతాయని బాంబు పేల్చారు. అయితే ఆయన చెప్పిన మాటలు కూడా ప్రస్తుతం ఏఐ దూకుడు చూస్తుంటే వాస్తవికతగా చాలా దగ్గరగానే ఉన్నాయి.

**5 ఏళ్లలోనే ఐటీ రంగాని ముగింపు?**

గతంలో వచ్చిన ఇంటర్నెట్, స్మార్ట్‌ఫోన్ విప్లవాలు కేవలం ప్లాట్‌ఫామ్‌లను మాత్రమే మార్చాయన్నారు వినోద్ ఖోస్లా. కానీ ఏఐ అనేది నేరుగా మానవ మేధస్సునే భర్తీ చేస్తోందని వెల్లడించారు. అందువల్ల రానున్న ఐదేళ్లలో చాలా విషయాల్లో మనుషుల కంటే ఏఐ మెరుగ్గా పనిచేస్తుందని.. దీనివల్ల ప్రస్తుతం మనం చూస్తున్న సాంప్రదాయ ఐటీ సర్వీసెస్, బీపీఓల అవసరం ఉండదని కుండ బద్దలు కొట్టారు. ఇప్పుడు 22–25 ఏళ్ల వయసున్న యువత తమ 40వ ఏటకు వచ్చేసరికి ప్రపంచంలో ఉద్యోగాల సంఖ్య ఊహించనంతగా తగ్గిపోతుందని హెచ్చరించారు.

కేవలం సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లే కాదు.. రాబోయే 15 ఏళ్లలో అకౌంటెంట్లు, డాక్టర్లు, లాయర్లు, ఆర్కిటెక్టు, చిప్ డిజైనర్లు వంటి నిపుణుల అవసరం కూడా తగ్గిపోతుందని ఖోస్లా అంచనా వేశారు. ఏఐ వర్కర్లు మానవ అకౌంటెంట్ల కంటే మెరుగ్గా లెక్కలు తేల్చగలరని, క్యాన్సర్ నిర్ధారణలో నిష్ణాతులైన డాక్టర్ల కంటే ఏఐ మెరుగ్గా పనిచేస్తుందని వివరించారు. దీనివల్ల ఆర్థిక వ్యవస్థలో ఉత్పాదకత పెరిగినప్పటికీ.. ఉపాధి ఉద్యోగ అవకాశాలు మాత్రం భారీగా దెబ్బతింటాయన్నారు.

**రోబోటిక్ విప్లవం..**

మేధోపరమైన పనుల తర్వాత రోబోటిక్ విప్లవం వస్తుందని.. ఇది శ్రమతో కూడిన పనులను పూర్తిగా మార్చేస్తుందని ఖోస్లా చెప్పారు. ఇంట్లో గిన్నెలు కడగడం నుంచి ఫ్యాక్టరీ అసెంబ్లీ లైన్ల వరకు రోబోలే ఆక్రమిస్తాయని వీటి నిర్వహణ ఖర్చు గంటకు కేవలం 2 నుంచి 3 డాలర్లు అంటే దాదాపు రూ.160 - రూ.250 మాత్రమే ఉంటుందని వెల్లడించారు. దీనివల్ల 2035 నాటికి ప్రపంచవ్యాప్తంగా వస్తువుల ధరలు విపరీతంగా తగ్గి డీఫ్లేషనరీ ఎకానమీ ఏర్పడుతుందని షాకింగ్ విషయం వెల్లడించారు.

**భారతదేశానికి ఏకైక మార్గం ఇదే..**


భారత్ తన వద్ద ఉన్న 25 కోట్ల మంది యువతను కేవలం ఐటీ సేవలకే పరిమితం చేయకుండా.. ఏఐ ఆధారిత వస్తువులను, సేవలను ప్రపంచానికి ఎగుమతి చేసే స్థాయికి ఎదగాలని ఖోస్లా సూచించారు. దేశం సొంతంగా సావరిన్ ఏఐ మోడళ్లను అభివృద్ధి చేసుకోవాలని.. అప్పుడే అమెరికా, చైనాల ఆధిపత్యాన్ని అడ్డుకోగలమని చెప్పారు. అమెరికాలోని డొనాల్డ్ ట్రంప్ వలస విధానాలు ఆ దేశానికే నష్టమని.. హెచ్–1బీ వీసాలపై ఆంక్షలు ఆవిష్కరణలను అడ్డుకుంటాయని విమర్శించారు. మొత్తానికి వినోద్ ఖోస్లా మాటలు వింటుంటే మార్పును అందిపుచ్చుకున్న వారు మాత్రమే ఈ ఏఐ సునామీలో నిలబడగలరని తెలుస్తోంది. ఈ మార్పును తట్టుకోవడానికి ప్రభుత్వాలు ఇప్పటి నుంచే ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాలని ఆయన హెచ్చరించారు.

# నేటి నుంచి బయో ఏషియా సదస్సు

హైదరాబాద్, ఫిబ్రవరి 16: తెలంగాణ ప్రభుత్వం ప్రపంచ స్థాయిలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 23వ బయో ఏషియా 2026 అంతర్జాతీయ సదస్సు ఫిబ్రవరి 17 మంగళవారం నుండి భాగ్యనగరంలో అట్టహాసంగా ప్రారంభం కానుంది. హైదరాబాద్ లోని హైటెక్స్ వేదికగా రెండు రోజుల పాటు జరగనున్న ఈ సదస్సును రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారు. ఈ ఏడాది సదస్సును 'టెక్బయో అన్లిష్డ్ ఏఐ, ఆటోమేషన్, జీవశాస్త్ర రంగంలో వస్తున్న విప్లవాత్మక పరిణామాలు' అనే ప్రధాన ఇతివృత్తంతో నిర్వహిస్తున్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానమైన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎ), ఆటోమేషన్ వంటివి లైఫ్ సైన్సెస్, హెల్త్కేర్ రంగాలను ఎలా ప్రభావితం చేస్తున్నాయనే అంశాలపై ఈ సదస్సులో లోతైన చర్చలు జరగనున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముందుగా అంతర్జాతీయ ఎగ్జిబిషన్ను ప్రారంభించి, అనంతరం సదస్సును ఉద్దేశించి ప్రసంగించనున్నారు. ఈ సదస్సులో పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో పాటు అంతర్జాతీయ స్థాయి నిపుణులు పాల్గొంటారు. పెన్సిల్వేనియా యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ మెడిసన్ ప్రొఫెసర్ ప్రొఫెసర్ బ్రూస్ ఎల్ లెవిన్, ఆన్జెన్ చీఫ్ సైంటిఫిక్ ఆఫీసర్ డాక్టర్ హోవర్డ్ వై చాంగ్ పాల్గొననున్నారు.వీరితో పాటు 50కి పైగా దేశాల నుండి సుమారు 4,000 మంది ప్రతినిధులు, శాస్త్రవేత్తలు, ఫార్మా దిగ్గజాలు ఈ వేదికపై తమ అభిప్రాయాలను పంచుకోనున్నారు. రెండు రోజుల పాటు జరిగే ఈ సదస్సులో లైఫ్ సైన్సెస్ రంగానికి సంబంధించిన అనేక కీలక అంశాలతో పాటు నెక్ట్స్ జనరేషన్ బయోలాజిక్స్.. ఔషధ తయారీలో వస్తున్న నూతన మార్పులు. ఏఐ / డిజిటల్ ట్రాన్స్ఫర్మేషన్.. డేటా అనలిటిక్స్, ఏఐ సాయంతో రోగ నిర్ధారణ, చికిత్స. తెలంగాణ రైజింగ్ 2047.. 2047 నాటికి తెలంగాణను వరల్డ్–క్లాస్ లైఫ్ సైన్సెస్ ఎకోసిస్టమ్గా మార్చే రోడ్మ్యాప్.

ఆర్/ డీ (పరిశోధన).. గ్లోబల్ హెల్త్ ఇంపాక్ట్, కొత్త వ్యాధుల చికిత్సకు అవసరమైన మౌలిక వసతులు వంటి వాటిపై చర్చాగోష్టులు నిర్వహించనున్నారు. ఈ సదస్సు ద్వారా హైదరాబాద్ నగరం ప్రపంచ లైఫ్ సైన్సెస్ మ్యాప్లో తన స్థానాన్ని మరింత సుస్థిరం చేసుకోనుంది. లైఫ్ సైన్సెస్ రంగంలో సుమారు 9,000 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్, 175కి పైగా ప్రదర్శనకారులు ఈ సదస్సు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నారు. దేశంలోనే అతిపెద్ద 'టెక్బ్యో' హబ్ తెలంగాణను తీర్చిదిద్దడమే లక్ష్యంగా ఈ సదస్సు రూపుదిద్దుకుంది.

## శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి కళ్యాణోత్సవంలో పాల్గొన్న మాజీ సర్పంచ్ స్వర్ణలత భాగ్యరాజ్



**ఫిబ్రవరి 16 (సీ కే న్యూస్) చేగుంట:** చేగుంట మండలం చందాయి పేట గ్రామంలో ఈరోజు శ్రీశ్రీశ్రీ కేతకి భ్రమరాంభ సహిత మల్లిఖార్జున స్వామి కళ్యాణోత్సవం మరియు అగ్నిగుండం కార్యానికి
ఆహ్వానించువారు: శ్రీ మల్లిఖార్జున స్వామి యాదవ సంఘం. ఆధ్వర్యంలో మాజీ సర్పంచ్ బుడ్డ స్వర్ణలతభాగ్యరాజ్, దర్శన అనంతరం యాదవ సంఘం ఆధ్వర్యంలో చిన్న సన్మాన కార్యక్రమం ఈ కార్యక్రమంలో పెద్దల యాదయ్య. ఎర్ర కిష్టయ్య.కర్రె కిష్టయ్య. తోటగొల్ల యాదయ్య. మాజీ ఉపసర్పంచ్ మల్లేష్.బండ నర్సింలు.కిష్టయ్య.అల్లాడు మల్లయ్య.అల్లాడి నర్సింలు.బండ దాకులు.యాదవ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు

## ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేయాలి.

- బిఆర్ఎస్ కార్పొరేటర్లకు ఎంపీ రవిచంద్ర పిలుపు.
- మేయర్ డిప్యూటీ మేయర్ ఎన్నికను బహిష్కరించిన బిఆర్ఎస్.
- తెలంగాణ తల్లికి నివాళులు అర్పించిన కార్పొరేటర్లు.



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),ఫిబ్రవరి 16,**
బీఆర్ఎస్ కార్పొరేటర్లు కొత్తగూడెం ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేయాలని.. నిరంతరం ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ అధినేత కేసిఆర్ మీద అభిమానంతో.. మీపై విశ్వాసంతో.. ఓట్లు వేసి గెలిపించిన ప్రజల
నమ్మకాన్ని వమ్ము చేయకుండా.. ప్రజా విశ్వాసాన్ని చూరాగొనాలని సూచించారు. మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావులతో కలిసి ఎంపీ రవిచంద్ర.. కొత్తగూడెం కార్పొరేషన్ లో కొత్తగా ఎన్నికైన బీఆర్ఎస్ కార్పొరేటర్లతో స్థానిక తెలంగాణ భవన్ లో సమావేశమయ్యారు. మున్సిపల్ కార్యాలయంలో కొత్తగా ఎన్నికైన కార్పొరేటర్లతో జరిగే ప్రమాణ స్వీకార కార్యక్రమానికి బిఆర్ఎస్ పక్షాన ఎన్నికైన కార్పొరేటర్లు దూరంగా ఉన్నారు. తదనంతరం జరిగిన మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నికల కార్యక్రమాన్ని కూడా పార్టీ నిర్ణయం మేరకు కార్పొరేటర్లు బహిష్కరించారు. తొలుత బిఆర్ఎస్ కార్పొరేటర్లు తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కార్పొరేటర్లతో ఎంపీ రవిచంద్ర మాట్లాడుతూ.. కార్పొరేషన్ లో అధికార పక్షం చేసే తప్పులను, గుర్తించి.. ఎప్పటికప్పుడు వాటిని ఎండగడుతూ నిలదీయాలని పిలుపు నిచ్చారు. అవసరమైతే ప్రజల పక్షాన పోరాటాలు చేయాలని సూచించారు.

## మహా శివరాత్రి సందర్భంగా అన్నదానం, ఇబ్రహీంపూర్ లో



**ఫిబ్రవరి 16 (సీ కే న్యూస్) చేగుంట/** చేగుంట మండల్ ఇబ్రహీంపూర్ గ్రామంలో అత్యంత పురాతనమైన శ్రీ శివాలయం 300 సంవత్సరాల పురాతన ఈ ఆలయంలో మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని తెల్లవారుజామున 4. గంటల నుంచి భక్తులు స్వామివారిని దర్శించుకుని సోమవారం ఉదయం అన్నదాన కార్యక్రమం కూడా జరిగింది అన్నదాన దాతలు. సర్పంచి జ్యోతి రాంరెడ్డి. ఉప సర్పంచ్ చౌదరి శ్రీనివాస్. ఎర్ర గొల్ల మల్లేశం .మఠం కృష్ణ.సతీష్ గౌడ్. గడీల రాజు.కుమ్మరి భూపాల్. చాకలి కుమార్. బెదరమైన స్వామి మఠం ఆంజనేయులు.. నీల రాములు మరియు గ్రామ పెద్దలు ప్రజలు తదితరులు పాల్గొన్నారుద

## ఆర్థిక సాయం అందజేసిన కన్నేటి శ్రీనివాసరావు దంపతులు.

**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.** వృద్ధాప్యంతో బాధపడుతూ ఎలాంటి ఆసరా లేకుండా దీన స్థితిలో ఉన్న అభాగ్యులకు మీకు నేను ఉన్నాను అంటూ సంకల్పంతో ప్రొద్దుటూరు గ్రామానికి చెందిన శ్రీ కన్నేటి శ్రీనివాసరావు - బేబీ గార్ల పుణ్య దంపతులు ప్రొద్దుటూరు గ్రామంలో దీనస్థితిలో వృద్ధాప్యంతో బాధపడుతున్న శ్రీ ఆంచా మంగమ్మ శ్రీ గొర్రె ముచ్చు శ్రీ చేబ్రోలు నాగులమ్మ కు తన వంతుగా ఆర్థిక సహాయం అందజేస్తున్న దృశ్యం ఈ పుణ్య దంపతులకు కృతజ్ఞతలు తెలిపిన పొద్దుటూరు గ్రామ ప్రజలు ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు



## వాంకుడోత్ కృష్ణ నాయక్ ఇంటి ఆవరణలో ఘనంగా సేవాలాల్ 287వ జయంతి వేడుకలు...



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా / భద్రాచలం ప్రతినిధి, (సాయి కౌశిక్),ఫిబ్రవరి 16,** గిరిజన ఆరాధ్య దైవం సంత్ శ్రీ శ్రీ శ్రీ సద్గురు సంత్ సేవాలాల్ మహారాజ్ 287 వ జయంతి వేడుకలను భద్రాచలం ప్రభుత్వ ఏరియా హాస్పటల్ రిటైర్డ్ ఆర్ జె డి ప్రిన్సిపల్ వాంకుడోత్ కృష్ణ నాయక్ సతీమణి రజనీకుమారి ఇంటి ఆవరణ నందు భోగ్ బండారో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రిటైర్డ్ ఆర్ జె డి ప్రిన్సిపల్ వాంకుడోత్ కృష్ణ నాయక్ మాట్లాడుతూ సేవాలాల్ మహారాజ్ బంజారాలను ఐక్యం చేయడం కోసం ప్రతి తండాను వారి అభివృద్ధి కోసం వారు స్వతహాగా స్వయం కృషితో ఎదగాలని తద్వారా అనే నినాదంతో ఆనాటి కాలంలో ఎంతో కృషి చేశారన్నారు. అదేవిధంగా బ్రిటిష్ కాలం లో కూడా మతమార్పిడిని వ్యతిరేకించిన మహనీయుడు సేవాలాల్ మహారాజ్ అని కొనియాడారు. సేవాలాల్ మహారాజ్ 18వ శతాబ్దాని కి చెందిన గొప్ప ఆధ్యాత్మిక గురువు, సంఘ సంస్కర్త. ఆయనను బంజారాలు (లంబాడీలు) తమ ఇష్టదైవంగా పూజిస్తారు. ఆయన ఫిబ్రవరి 15, 1739 న అనంతపురం జిల్లాలోని గొత్తి సమీపంలోని సేవాగఢ్ (రామచంద్రపురం)లో జన్మించారు. అహింస, శాంతి, మరియు మానవత్వాన్ని ఆయన బోధించారు. ముఖ్యంగా మూఢనమ్మకాలను విడనాడాలని, పర్యావరణాన్ని ప్రేమించాలని మరియు మహిళలను గౌరవించాలని ఆయన పిలుపునిచ్చారు. సేవాలాల్ జయంతినీ రాష్ట్ర పండుగగా గుర్తించి సెలవు ఇవ్వాలని కోరారు.
ఈ కార్యక్రమంలో బంజారా సంఘం నాయకులు బన్సీలాల్ హెల్త్ డిపార్ట్మెంట్, భూక్యా రంగ, రిటైర్డ్ ప్రిన్సిపాల్ తిప్పన్న సిద్దులు, భూక్యా రంజిత్ నాయక్ , మదర్, హెచ్ఎం భాష , జూనియర్ కాలేజ్ లెక్చరర్ మాన్సింగ్, మోతిలాల్ స్కూల్ అసిస్టెంట్, ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్ జాన్ మిల్టన్, అసిస్టెంట్ ప్రొఫెసర్ శ్రీనివాస్, లైబ్రరియన్ గరుడాచలం, హెచ్ఎం మదార్ నాయక్, భూక్యా మాన్ సింగ్, రిటైర్డ్ ప్రిన్సిపల్ బిక్షపతి బంజారా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కొలువుదీరిన పురపాలక 'పాలకులు': నూతన మేయర్, చైర్మన్లకు మంత్రి పొంగులేటి శుభాకాంక్షలు

**సికే న్యూస్ ప్రతినిధి ఖమ్మం :** ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని మున్సిపల్ కార్పొరేషన్, మున్సిపాలిటీలకు నూతనంగా ఎన్నికైన మేయర్, చైర్మన్లతో పాటు, డిప్యూటీ మేయర్, వైస్ చైర్మన్లు , నూతనంగా ప్రమాణ స్వీకారం చేసిన కౌన్సిలర్లు, కార్పొరేటర్లకు తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ఈ నూతన సారథులు ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ పట్టణాల అభివృద్ధిలో క్రియాశీలక పాత్ర పోషించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు.
కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ తొలి మేయర్‌గా బాధ్యతలు చేపట్టిన మూడ్ గణేష్ (సీపీఐ), డిప్యూటీ మేయర్‌గా ఎన్నికైన సిరిపురపు లలిత (కాంగ్రెస్)లకు మంత్రి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. వీరితో పాటు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎన్నికైన మున్సిపల్ చైర్మన్లు, వైస్ చైర్మన్లను ఆయన అభినందించారు. మధిర మున్సిపల్ చైర్మన్ సామినేని సుజాత, వైస్ చైర్మన్ కోట ధనమూర్తి, సత్తుపల్లి చైర్మన్ రెహానా బేగం, వైస్ చైర్మన్ బొంతు సుమలత, వైరా చైర్మన్ కాపా చంద్రకళ, వైస్ చైర్మన్ కట్ల సంతోష్, అశ్వారావుపేట చైర్మన్ జూపల్లి శశికళ, వైస్ చైర్మన్ జూపల్లి రమేష్, ఏదులాపురం చైర్మన్ పోకబత్తిని అనిత, వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్, కల్లూరు మున్సిపల్ చైర్మన్ ధరావత్ మోహన్ నాయక్, వైస్ చైర్మన్ శీలం కోటేశ్వరిలకు మంత్రి పొంగులేటి శుభాకాంక్షలు తెలుపుతూ.. వారంతా ప్రజలకు అందుబాటులో ఉంటూ ఆదర్శవంతమైన పాలన అందించాలని సూచించారు.
పట్టణాల్లోని ప్రతి వార్డు, డివిజన్ అభివృద్ధి చెందాలంటే కౌన్సిలర్లు, కార్పొరేటర్లతో కూడిన పూర్తి పాలకవర్గం పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా వార్డులు, డివిజన్లలోని మౌలిక సదుపాయాల కల్పన, పారిశుధ్యం, తాగునీటి సమస్యల పరిష్కారమే ధ్యేయంగా నూతన పాలకవర్గాలు పనిచేయాలని ఆయన సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో పట్టణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని మంత్రి పొంగులేటి హామీ ఇచ్చారు.



FILE PHOTO

## రాష్ట్ర స్థాయి సీఎం కప్ ఫెన్సింగ్ పోటీలకు ఆరుగురు ఎంపిక కోచ్ కర్ణం గణేష్ వెల్లడి



**ఫిబ్రవరి 16 (సీ కే న్యూస్) చేగుంట**
సోమవారం నాడు, చేగుంట లోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జరిగిన రెండవ సీఎం కప్ ఎడిషన్ లో భాగంగా అండర్ 14 జిల్లాస్థాయి ఫెన్సింగ్ సెలెక్షన్స్ జరగగా, ఈ క్రీడల్లో పాల్గొనడానికి జిల్లా నలుమూలల నుండి 80 మంది వరకు క్రీడాకారులు,క్రీడాకారిణిలు పాల్గొనగా అందులో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ముగ్గురు అమ్మాయిలను, ముగ్గురు అబ్బాయిలను రాష్ట్ర స్థాయికి ఎంపిక చేయడం జరిగిందని జిల్లా యువజన మరియు క్రీడా అధికారి రమేష్, కోచ్ కర్ణం గణేష్ రవికుమార్ ఒక సంయుక్త ప్రకటన తెలిపారు, బాలికల విభాగంలో సుదీప్తి ఈఫీ విభాగంలో,యం.డి ఆర్మీను, ఫాయిల్ విభాగంలో,మనీషా సాబేర్ విభాగంలో ఎంపికవ్వగా,బాలుర విభాగంలో వినయ్ తేజ ఈఫీ విభాగంలో, ఫాయిల్ విభాగంలో అభినవ్, సాబేర్ విభాగంలో కునాల్ ఎంపికయ్యారని వారు తెలిపారు.ఎంపికైన వీరు ఈ నెల 20 నుండి 22 వరకు హైదరాబాద్ లోని లాల్ బహదూర్ శాస్త్రి స్టేడియంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మల్లీశ్వరి రిఫరీలు నిశాంత్,స్వర్ణలత పాల్గొన్నారు.వీరు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికవ్వడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

## కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్‌లో మేయర్, డిప్యూటీ మేయర్ ఏకగ్రీవ ఎన్నిక.


**మేయర్‌గా మూడ్ గణేష్, డిప్యూటీ మేయర్‌గా సిరిపురపు లలితా కుమారి ఎన్నిక.**






**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, (సాయి కౌశిక్),ఫిబ్రవరి 16,** కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం సర్వసభ్య సమావేశం నిర్వహించబడింది. మున్సిపల్ సాధారణ ఎన్నికల అనంతరం నూతనంగా ఎన్నికైన కార్పొరేటర్ల ప్రమాణ స్వీకారం మరియు మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నికల కార్యక్రమం నియమావళి ప్రకారం నిర్వహించబడింది. సమావేశానికి జిల్లా అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్ అధ్యక్షత వహించి,ఎన్నికైన సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు.
మొత్తం 60 డివిజన్లకు గాను ఎన్నికైన కార్పొరేటర్లు ప్రమాణ స్వీకారం చేశారు. సీపీఐ పార్టీకి చెందిన 22 మంది, కాంగ్రెస్ పార్టీకి చెందిన 22 మంది, బీజేపీకి చెందిన 1 మంది, సీపీఎం పార్టీకి చెందిన 1 మంది, స్వతంత్రంగా గెలుపొందిన 6 మంది సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. బీఆర్ఎస్ పార్టీకి చెందిన 8 మంది కార్పొరేటర్లు గైర్హాజరయ్యారు.
అనంతరం మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నికల ప్రక్రియ నిర్వహించబడింది. 20వ డివిజన్‌కు చెందిన సీపీఐ కార్పొరేటర్ మూడ్ గణేష్ మేయర్‌గా, 8వ డివిజన్‌కు చెందిన కాంగ్రెస్ కార్పొరేటర్ సిరిపురపు లలితా కుమారి డిప్యూటీ మేయర్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.
ఎక్స్-అఫీషియో సభ్యులుగా సమావేశానికి హాజరైన స్థానిక శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు, ఖమ్మం పార్లమెంటు సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి తమ ఓటు హక్కును వినియోగించారు.
ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన మేయర్ మూడ్ గణేష్ మాట్లాడుతూ, కార్పొరేషన్ పరిధిలోని 60 డివిజన్లలో సమాన అభివృద్ధి సాధించేందుకు కట్టుబడి పనిచేస్తానని తెలిపారు. పట్టణంలోని మౌలిక సదుపాయాల అభివృద్ధి, పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, రహదారుల అభివృద్ధి మరియు ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తానని అన్నారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకునే విధంగా పారదర్శక, బాధ్యతాయుత పాలన అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు.
ఎక్స్-అఫీషియో సభ్యులు నూతనంగా ఎన్నికైన మేయర్, డిప్యూటీ మేయర్,కార్పొరేటర్లందరికీ శుభాకాంక్షలు తెలియజేస్తూ, కార్పొరేషన్ అభివృద్ధి కోసం సమన్వయంతో పనిచేయాలని సూచించారు.
జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్, మున్సిపల్ ఎన్నికల సాధారణ పరిశీలకులు అమోయ్ కుమార్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన ఐడీఓసి కార్యాలయం నుండి వెబ్‌కాస్టింగ్ ద్వారా ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షించారు. ఎన్నికలు శాంతియుతంగా, పారదర్శకంగా నిర్వహించబడినట్లు అధికారులు తెలిపారు.
ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సుజాత, సంబంధిత శాఖల అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## మరణానంతరం శరీర దానం అద్భుతం..



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, (సాయి కౌశిక్), ఫిబ్రవరి 16,** మెడికల్ కాలేజీ కి శరీర దాన దరఖాస్తు ను ఇచ్చిన గొల్లపల్లి దయానంద్,రావు, భూక్యా భిక్కులాల్, భూక్యా హచ్చి వినయ్,ఝాన్సీ రాణి నేత్ర, అవయవ దాన ప్రోత్సహకూల సంగ వ్యవస్థాపకులు కొచ్చెర్ల కమల రాణి మాట్లాడుతూ సంస్థ స్థాపించినప్పటినుండి ఇప్పటివరకు 10మంది దానం చేసారని మెడికల్ కాలేజీ స్టూడెంట్స్ కూ ప్రాక్టీకల్స్ కూ ఉపయోగిస్తారని, మనం చనిపోయిన తరువాత ఇచ్చే ఈ డొనేషన్ కుటుంబ సభ్యులకు ముందుగా తెలియ చేసీ ఆ తరువాతనే వారి సమక్షంలో మనం దరఖాస్తు ఇవ్వాల్సి వస్తుందని, బ్రతికున్నప్పుడే కాదు చనిపోయిన తరువాత కూడా ఇలా ఉపయోగ పడడం చాలా సంతోషం అన్నారు. అలాగే దయానందు లాంటి పెద్దమనిషులు ఇవ్వడం వలన అందరికి అవగాహనా పెరుగుతుందనీయు, ఎవరైనా ఇలా నేత్ర, అవయవాలు దానం చేయాలి అంటే ఈ నంబర్ కూ సంప్రదించగలరని 89195 69524 ఝాన్సీ రాణి నేత్ర, అవయవ దాన ప్రోత్సహకూల సంగ వ్యవస్థాపకులు కొచ్చెర్ల కమల రాణి అన్నారు.

# కొలువుతీరిన కార్పోరేషన్ పాలక మండలి.




- మేయర్ గా మూడ్ గణేష్
- డిప్యూటీ మేయర్గా లలిత కుమారి
- చెరో రెండున్నరేళ్ల పాలన
- బిఆర్ఎస్ కార్పోరేటర్లు గైర్హాజర్
- ర్యాలీగా కార్పోరేషన్ కార్యాలయానికి
- సందడిగా మారిన ప్రాంగణం.

**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),ఫిబ్రవరి 16,**కొత్తగూడెం కార్పోరేషన్ తొలి పాలకవర్గ కొలువుతీరింది. మేయర్ మూడ్ గణేష్ (20వ డివిజన్) డిప్యూటీ మేయర్ గా సిరిపురపు లలితకుమారి (8వ డివిజన్)లు ఏక గ్రీవంగా ఎన్నికయ్యారు. తొలూత ఆయా డివిజన్ల నుండి గెలుపొందిన వారితో కార్పోరేటర్లుగా జిల్లా జాయింట్ కలెక్టర్ వేణుగోపాలరావు ప్రమాణస్వీకారం చేయించిన అనంతరం మేయర్, డిప్యూటీ మేయర్ల ఎంపిక జరిగింది. సిపిఐ కార్పోరేటర్ అడుసుమిల్లి సాయిబాబా మేయర్ గా మూడ్ గణేష్ను ప్రతిపాదించగా స్వతంత్ర కార్పోరేటర్ కంభంపాటి దుర్గాప్రసాద్ బలపరిచారు. డిప్యూటీ మేటర్గా సిరిపుర వులలిత కుమారిని కనుకుంట్ల శ్రీనివాస్ ప్రతిపాదించగా బోయిన విజయ్ కుమార్ బలపరిచారు. దీంతో మూడు రోజుల ఉత్కంఠతకు తో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

చెరో రెండున్నరేళ్ల పాటు : అభ్యర్థుల నామినేషన్ల నాటి నుండి ఎన్నికల ఫలితాలు వెలువడి, పదవులు చేపట్టేంత వరకు తీవ్ర ఉత్కంఠ
వాతావరణం కార్పోరేషన్ వ్యాప్తంగా నెలకొంది. ప్రధానంగా సిపిఐ, కాంగ్రెస్ పార్టీలకు సీట్లు సమానంగా రాగా మేయర్ పీఠం ఎవరిని వరిస్తుందో అనే టెన్షన్ నెలకొంది. కాగా సిపిఐ, కాంగ్రెస్ల అగ్రనాయకత్వం చర్చోపచర్చల అనంతరం ఐదేళ్ల పాలనను చెరో రెండున్నరేళ్ల పాటు చేపట్టాలని నిర్ణయం తీసుకున్నారు. ఒప్పందంలో భాగంగా తొలి రెండున్నరేళ్లు సిపిఐ కు చెందిన మూడ్ గణేష్ మేయర్, కాంగ్రెస్కు చెందిన సిరిపురపు లలిత కుమారి డిప్యూటీ మేయర్ గా పదువులు చేపట్టారు. మరో రెండున్నరేళ్లు మేయర్గా కాంగ్రెస్, డిప్యూటీ మేయర్ పదవిని సిపిఐ చేపట్టనుంది. దీంతో కొత్తగూడెం తొలి కార్పోరేషన్ పాలక మండలి కొలువుతీరింది. ఇందిలా ఉండగా బిఆర్ఎస్ నుండి గెలిచిన ఎనిమిది మంది కార్పోరేటర్లు గైర్హాజరయ్యారు. కాగా వీరు మరోరోజు ప్రమాణ స్వీకారం చేయనున్నారు.

సమిష్టిగా : ఇరు పార్టీల అగ్రనాకత్వం ఒప్పందం ప్రకారం సమిష్టిగా కలిసి ముందుకు సాగేందుకు నిర్ణయించుకున్నారు. ఇందు కోసం ప్రమాణస్వీకారానికి ముందుగా ఓ హోటల్లో ఎంపి రామసహాయం రఘురామిరెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎయిఎల్ఎ కూనంనేని సాంబశివరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు పల్లా వెంకటరెడ్డి, భాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషాలు కార్పోరేటర్లతో ప్రత్యేకంగా సమావేశ మయ్యారు. జరిగిన ఒప్పందాన్ని వారికి వివరించి అదినాయకత్వం మాటే శిరోధార్యమని చెప్పి మేయర్, డిప్యూటీ మేయర్ పేర్లను ప్రకటించారు. అనంతరం ర్యాలీగా కార్పోరేషన్ కార్యాలయానికి చేరుకున్నారు. దీంతో దారి పోడవునా సందడి వాతావరణం నెలకొంది. ర్యాలీలో అగ్రభాగాన కూనంనేని నిలవడంతో పెద్ద ఎత్తున అభివాదాలు, నినాదాలు మిన్నంటాయి.

సందడి నందడి : ప్రమాణ స్వీకారోత్సవం సందర్భంగా కార్పోరేషన్ కార్యాలయం ఆవరణ సందడిగా మారింది. ఇరు పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలతో పాటు మేయర్, డిప్యూటీ మేయర్, కార్పోరేటర్ల బంధువులు, స్నేహితులు, అభిమానులు, సన్నిహితులతో ఆ ప్రాంగణం-జనసంద్రమైంది. ప్రామాణ స్వీకారం అనంతరం మేయర్, డిప్యూటీ మేయర్, కార్పోరేటర్లు బయటకు రాగా పెద్దపెట్టున నినానాదలు చేశారు. వారిని కులుసుకుని అభినందనలు తెలిపేందుకు ఎగబడ్డారు.

## కొత్తగూడెం న్యాయవాదుల విధుల బహిష్కరణ..



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, (సాయి కౌశిక్) ఫిబ్రవరి 16,**హైదరాబాద్ లో అత్తపూర్ న్యాయవాది మహమ్మద్ ఖదీర్ దారుణ హత్యకు నిరసనగా ఫేడరేషన్ ఆఫ్ బార్ అసోసియేషన్స్ ఫర్ తెలంగాణ ఇచ్చిన పిలుపులో భాగంగా కొత్తగూడెం బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు జనపరెడ్డి గోపి కృష్ణ అధ్యక్షతన కొత్తగూడెం బార్ అసోసియేషన్ అత్యవసర సమావేశం ఏర్పాటు చేసి న్యాయవాది మహమ్మద్ ఖదీర్ దారుణ హత్య కు నిరసనగా కొత్తగూడెం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమ వారం విధులు బహిష్కరణ చేశారు. అనంతరం ఉపాధ్యక్షుడు జనపరెడ్డి గోపి కృష్ణ అధ్యక్షతన కోర్టు గేట్ బయట ప్లకార్డ్ లతో నిరసన కార్యక్రమం చేపట్టారు. న్యాయవాదుల రక్షణ చట్టం వెంటనే అమలు చేయాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే న్యాయవాదుల రక్షణ కు అవసరం అయిన అన్ని చర్యలు తీసుకోవాలని ప్రభుత్వలను గోపి కృష్ణ డిమాండ్ చేశారు. న్యాయవాదులకు సంరక్షణ చట్టం వెంటనే అమలు చేయాలని లేని పక్షంలో ఫేడరేషన్ ఆఫ్ బార్ అసోసియేషన్స్ ఫర్ తెలంగాణ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు లను జనపరెడ్డి గోపి కృష్ణ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు హన్మంతరావు, చిరంజీవి రావు, పి. నాగేశ్వరరావు, కే.పుల్లయ్య, మన్మోహన్, యెర్రాపాటి కృష్ణ, శ్రీధర్, మహమ్మద్ సాదిక్ పాషా, మారపాక రమేష్, మహేష్, చిన్ని కృష్ణ, విజయ్, రమేష్, ఏర్ర శ్రీను, మధన్ మోహన్, కేపి, తదితరులు పాల్గొన్నారు.

## తెలుగుదేశం పార్టీ నాయకులు బండ్ల రాము చిత్రపటానికి నివాళులు.



**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.**పందిళ్ళపల్లి గ్రామానికి చెందిన ఖమ్మం పట్టణ తెలుగుదేశం నాయకులు బండ్ల రాము మృతి పట్ల పలువురుఆయనచిత్రపటానికినివాళు లర్పించారు.కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు తేలుకుంట్ల శ్రీనివాసరావు,మండలసిపిఎం నాయకులు వత్సవాయి జానకి రాములు, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు కంచుమర్తిరామకృష్ణ,ఉపాధ్యాయ పెన్షనర్ సంఘం నాయకులు అంబటి శాంతయ్య,కంచుమర్తి పుల్లయ్య, అలవాల నాగేశ్వరరావు, టిఆర్ఎస్ పార్టీ నాయకులు సామినేని అప్పారావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తన్నీరు శ్రీనివాసరావు, తెలుగుదేశం పార్టీ నాయకులు తాళ్లూరి రాము తదితరులు నివాళులర్పించారు.

## పట్టుదలతో దివ్యాంగులు అన్ని రంగాలలో రాణించాలి......

- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- ప్రభుత్వ పాఠశాలల్లో క్రీడలకు ప్రాధాన్యత
- రాష్ట్రస్థాయి ఆటల పోటీల్లో పాల్గొనేందుకు జిల్లా నుండి ఎంపికైన దివ్యాంగ విద్యార్థుల బృందాన్ని అభినందించిన జిల్లా కలెక్టర్

**సికె న్యూస్ ప్రతినిధి ఖమ్మం:**పట్టుదలతో ముందడుగు వేసి దివ్యాంగ విద్యార్థులు అన్ని క్రీడా విభాగాలలో రాణించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు.దివ్యాంగ చిన్నారుల రాష్ట్రస్థాయి ఆటల పోటీల్లో పాల్గొనేందుకు ఖమ్మం జిల్లా నుండి వివిధ క్రీడా విభాగాలలో ఎంపికైన దివ్యాంగ విద్యార్థుల బృందానికి సోమవారం కలెక్టర్ లో జిల్లా కలెక్టర్ అభినందించారు. వారి బస్సు ప్రయాణానికి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ తో కలిసి జెండా ఊపి ప్రారంభించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ, దివ్యాంగుల్లో ఆత్మస్థైర్యం నింపడానికి క్రీడా పోటీలు దోహదపడతాయని, ఎందులోను మేము ఎవరికి తక్కువ కాదని, ఎల్లప్పుడూ అన్ని రకాల ఆటల పోటీలలో పాల్గొంటూ ఉండాలని అన్నారు.

హైదరాబాదులో జరుగుతున్న రాష్ట్రస్థాయి దివ్యాంగ చిన్నారుల ఆటల పోటీలకు ఖమ్మం జిల్లా తరుపున అండర్14, అండర్ 16 విభాగంలో 20 మంది వివిధ పోటీలకు హాజరవుతున్నారని తెలిపారు.రాష్ట్ర స్థాయిలో మానసిక వైకల్యం, అంధత్వం, బధిరత్వం, శారీరక అంగవైకల్యం మొదలగు కేటగిరీలలో విద్యార్థులకు క్రీడా పోటీలను నిర్వహిస్తారని వివరించారు.జిల్లా కమ్యూనిటీ




మొబిలైజింగ్ ఆఫీసర్ బాజోజు ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో 20 మంది దివ్యాంగ చిన్నారుల బృందానికి సహాయకులుగా ఐదుగురు ఐఆర్పిలు, ఇద్దరూ స్పెషల్ ఎడ్యుకేటర్లు, ఇద్దరు కేర్ గివర్లు, విద్యార్థుల తల్లిదండ్రులు వెళ్ళుతున్నారని వెల్లడించారు. క్రీడా పోటీలలో పథకాలు సాధించి విజేతలుగా నిలవాలని, ఖమ్మం జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులకు కలెక్టర్ మనోధైర్యం కల్పించారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి భవిష్యత్తులో మరింత మంచి నైపుణ్యాన్ని కనబర్చి కష్టపడి ఆడితే క్రీడల్లో మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. క్రీడలతో పాటు విద్యలో రాణించాలని, పాఠశాలకు మంచి పేరు ప్రతిష్టలు తీసుకు రావాలని సూచించారు. విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు కూడ ముఖ్యమేనని అన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో దీక్షా రైనా, ఇన్చార్జి డిఈవో శ్రీనివాసరావు, ఎఎస్పి భాను ప్రకాష్, డిఎస్ఓ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇంటికి స్లాబ్ నీ ప్రారంభించిన జగన్నాధపురం కాంగ్రెస్ నాయకులు



**సి కే న్యూస్ చింతకాని ప్రతినిధి.**మండల పరిధిలోని జగన్నాధపురం గ్రామంలో... ఇందిరమ్మ రాజ్యం, ప్రజాపాలనలో... రాష్ట్ర ఉపముఖ్యమంత్రి ఆర్థిక &విద్యుత్, ప్రణాళిక శాఖ మంత్రి వర్యులు లిమల్లు భట్టి కృషితో.జగన్నాధపురం గ్రామ శాఖ అధ్యక్షుడు అరువూరి వెంకటేశ్వర్లు రమాశేషు కు మంజూరైన నూతనంగా నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇంటికి స్లాబ్ కు కొబ్బరికాయ కొట్టి. స్లాబ్ కార్యక్రమానికి ప్రారంభించిన గ్రామ సర్పంచ్ తాళ్ళూరి స్వప్న. మరియు మండల కాంగ్రెస్ నాయకులు

అనంతరం కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ..మల్లు భట్టి విక్రమార్క కృషితోలి మధిర నియోజకవర్గంలోని శరవేగంగా ఇందిరమ్మ ఇల్లు పూర్తి అవుతున్నాయని, సకాలంలో బిల్లులు అందుతున్నాయని, ప్రతి ఒక్కరూ సకాలంలో ఇల్లులు పూర్తి చేసుకోవాలని అన్నారు. ప్రజాపాలన ప్రభుత్వంలోని ప్రతి పేదవారు సొంత ఇంటిని నిర్మించుకోవడం చాలా సంతోషంగా ఉందని నాయకులు పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో... మత్కేపల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్ బందెల నాగార్జున, గ్రామ సెక్రెటరీ చామర్తి కృష్ణమాచారి, మొదటి వార్డు సభ్యులు తోటకూరి హరీష్, కాంగ్రెస్ నాయకులు తాళ్ళూరి రమేష్, తోటకూరి సైదేశ్వరరావు, తోటకూరి నరసింహారావు,తన్నీరు పుల్లారావు, సింగు కిషోర్,అలవాల వెంకటేశ్వర్లు,గ్రామ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు మెట్టల కృష్ణ, వజ్రాల వెంకటేశ్వర్లు, గమ్మిడి ప్రసాద్, కొత్త పెళ్లి రామకోటి, కాశీమల శీను, గ్రామ మైనార్టీ శాఖ అధ్యక్షులు ఎస్ కే సైదా,చెవుల నాగేశ్వరావు,తదితరులు పాల్గొన్నారు.

## నూతన దర్గా నిర్మాణం గంధం పండుగ వారోత్సవం.

కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు గ్రామ అభివృద్ధి ప్రదాత చేగురు మల్లేశం.



**సి కె న్యూస్ మండలం ప్రతినిధి బాలరాజు ఫిబ్రవరి 16.** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం పరిధిలోని టేకుల సోమవారం గ్రామం లో. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు టేకులసోమవారం గ్రామ అభివృద్ధి ప్రదాత. పారిశ్రామికవేత్త చేగురు మల్లేశం వారి సొంత భూమి దగ్గర దర్గా ఏర్పాటు చేసినారు.

ఈరోజు ముస్లిం సోదరులు కుల మతాలకు అతీతంగా గ్రామ పెద్దలు గ్రామ ప్రజలు అందరూ పాల్గొని గంధం పండుగ ఉత్సవాలు ఘనంగా వైభవంగా గ్రామంలోని మసీదు నుండి నూతనంగా నిర్మించిన దర్గా వరకు ర్యాలీ నిర్వహిస్తూ ఆటపాటలతో బయలుదేరి గంధం పండుగ ఉత్సవం ఘనంగా నిర్వహించినారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు మండల రేకల ప్రభాకర్ రేఖల బాలరాజ్ బీసీ సంఘం అధ్యక్షులు సాయిని యాదగిరి మాద శంకర్ జహంగీర్ సెక్రెటరీ జాంగిర్ చేగురి అజయ్ చేగురి వంశీ ముస్లిం సోదర సోదరీమణులు బంధుమిత్రులు మండల నాయకులు అధిక సంఖ్యలో గంధం ఉత్సవ పండుగలో పాల్గొన్నారు.

## గ్రామంలో కెసిఆర్ హరితహారం... రోడ్డు ఇరువైపుల మొక్కలు...




**సి.కె న్యూస్, చింతకాని ప్రతినిధి** :తిర్లాపురం గ్రామంలో కేసీఆర్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హరితహారం కార్యక్రమంలో భాగంగా తిమ్మినేనిపాలెం గ్రామానికి వెళ్లే రోడ్డుకు ఇరువైపులా మొక్కలను నాటడం జరిగినది తిర్లాపురం గ్రామ సర్పంచ్ చాపలమడుగు వీరబాబు వాటి పరిరక్షణ బాధ్యతను కూడా సీరియస్గా తీసుకున్నారు. ఎండాకాలంలో మొక్కలపై ప్రభావంనీటి ఎద్దడ వాడిపోవడం ఎండ తీవ్రతకు నేలలోని తేమ ఆవిరైపోవడం వల్ల మొక్కలకు నీరు అందక ఆకులు, కొమ్మలు వాడిపోతాయి.వారానికి ఒక్కసారి నీరు అందించేలా,గ్రామ పంచాయతీ సిబ్బందికి తెలియజేశారు

## కలెక్టరేట్ లో మదర్ ఫీడింగ్ రూమ్ ప్రారంభించిన వరంగల్ ఆర్ జె డి ఝాన్సీ లక్ష్మి బాయి.

**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),ఫిబ్రవరి 16,**భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ఐడీఓసీ సమీకృత జిల్లా కార్యాలయముల సముదాయము నందు జిల్లా కలెక్టర్ ఆదేశాలతో జిల్లా సంక్షేమాధికారి స్వర్ణలత లెనినా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మదర్ ఫీడింగ్ రూమ్ ( బాలింత పాలు ఇచ్చే ప్రదేశం) ని రీజనల్ జాయింట్ డైరెక్టర్ ఝాన్సీ లక్ష్మీ బాయ్ ప్రారంభించడం జరిగింది . ఏర్పాటు చేసిన హబ్ సిబ్బంది ని అభినందించారు . వారు మాట్లాడుతూ కలెక్టరేట్ కి వివిధ పనుల నిమిత్తం చంటి పిల్లలతో వచ్చే తల్లులు తమ పిల్లలకు పాలు పట్టించాలంటే ఇబ్బంది గా ఉంటుందని అందరి ముందు పిల్లలకు పాలు ఇవ్వలేరని వారు సంశయిస్తుంటారని , వీటిని ఏర్పాటు చేయటం వలన వారు నిస్సంకోచంగా ఉపయోగించుకోగలుగుతారని అన్నారు . ఇలాంటి కేంద్రాలను బస్ స్టాండ్ మరియు రైల్వే స్టేషన్ లో కూడా ఏర్పాటు చేయ వలసినది గా సూచించారు .

ఈ కార్యక్రమంలో ఇంకా వారు మాట్లాడుతూ తల్లిపాల ప్రాముఖ్యత, శిశువుల ఆరోగ్య పరిరక్షణ, పోషకాహారం వంటి అంశాలపై తల్లులకు ఎక్కువగా అవగాహన కల్పించాలని, జననం తర్వాత తొలి ఆరు నెలలు శిశువుకు కేవలం తల్లిపాలు ఇవ్వడం వల్ల కలిగే ప్రయోజనాలను గ్రామస్థాయి



లో తల్లులకు వివరించాలని ఈ సందర్భంగా సూచనలు చేశారు

ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమాధికారి లెనీనా వారి సిబంది హసీనా , భార్గవి , ఐసిడిఎస్ సీ డీ పి ఓ లు ప్రసన్న లక్ష్మి , పద్మ శ్రీ , తార , సలోమి , అరుణ , జయలక్ష్మి , జ్యోతి , చైతన్య మరియు సూపర్వైజర్స్, డిహెచ్ఈ డబ్ల్యుకోఆర్డినేటర్ సంతోష రూప మరియు సిబ్బంది ,సఖి రాజమణి , సునీత మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## చేగుంట మండలంలోనీ, పలు తిరుణాలలో పాల్గొన్న సిహెచ్ శ్రీనివాస్ రెడ్డి

బోనాల దుర్గమ్మ జాతర లో కాంగ్రెస్ పార్టీ నాయకులు



**ఫిబ్రవరి 16 (సీ కే న్యూస్) చేగుంట /** చేగుంట మండలం ఉన్న పలు గ్రామాలలో, చందాయిపేట్, ఇబ్రహీంపూర్, రాంపూర్, , ఉల్లి తిమ్మాహిపల్లి గ్రామాలలో ఉన్న శివాలయం వద్ద మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు, బోనాల గ్రామం లో ఉన్న దుర్గమ్మ జాతరలో దుబ్బాక కాంగ్రెస్ ఇంచార్జ్ సి హెచ్ శ్రీనివాస్ రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు, ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ మండల అధ్యక్షులు వడ్ల నవీన్ కుమార్, బోనాల సర్పంచ్ సూకన్య నాగులు,ఉపాధ్యక్షులు మసాయిపేట్ శ్రీనివాస్, మండల్ జనరల్ సెక్రెటరీ కొండి శ్రీనివాస్, చేగుంట మార్కెట్ కమిటీ డైరెక్టర్ మొహమ్మద్ ముజామిల్, స్టాలిన్ నర్సిములు, అన్నం ఆంజనేయులు, ఇబ్రహీంపూర్ ఉప సర్పంచ్ చౌదరి శ్రీనివాస్, కన్యాయారం సతీష్, అయిత పరంజ్యోతి, సంతోష యాదవ్, రమేష్ ,సంతోష్ స్వామి, కాజీపురం వెంకట్ స్వామి, రాజ్యం,గ్రామ పెద్దలు ప్రజలు తదితరులు పాల్గొన్నారు